# సౌందర్య రేఖలు

"కాబినెట్ సైజ్ ఫోటో కావాలండీ." అప్పుడే డార్క్‌రూమ్‌లో కడిగి తీసుకువచ్చిన నెగటివ్‌ని క్లిప్పుకి తగిలించి తీక్షణంగా పరిశీలిస్తున్న శ్రీరామ్ ఆ సన్నటి స్వరం వినవచ్చినవైపు తలెత్తి చూశాడు. ఆ చూపులు కొన్ని క్షణాలవరకూ అలాగే నిలిచి పోయాయి, నిస్సందేహంగా ఆమే.

అతనలా తేరిపార చూస్తున్న కొద్ది క్షణాలు ఆమెకూడా చూడసాగింది. నిస్సందేహంగా అతనే.

ఆమె చూపులు మళ్ళించింది. అతనూ వెంటనే మరోవైపు చూశాడు. వీలైతే వెంటనే పారిపోవా లనిపించింది ఆమెకి. స్టూడియోలోని డార్క్‌రూమ్‌లోకి వెళ్ళిపోటానికి వీలైతే బాగుండు ననిపించింది అతనికి!

ఇద్దరి ముఖాన నెత్తురు చుక్క లేదు, అలాగే మాటలేకుండా ఇద్దరూ నిలబడిపోయారు. ఇందుకు కారణం ఆ ఉదయం జరిగిన ఒక చిన్న సంఘటన. ఇద్దరూ ఆ సన్నివేశాన్ని మనసుల్లో తిరగవోడి అయిష్టంగా ఆదృశ్యాన్ని మనోవీధుల్లో పరికించసాగారు.

ఆ ఉదయం జరిగింది మరేమంత ప్రమాదకరమైన విషయం కాదు. మామూలుగా శ్రీరామ్ స్టూడియోకి వెళుతున్నాడు. అన్నట్టు అతడు ఫొటోగ్రాఫరు, మంచి పేరున్న ఫొటోగ్రాఫరు. బి. ఎస్. సి. ఆనర్స్ ప్యాసయి రెండేళ్ళు క్షుణ్ణంగా ఫొటోగ్రఫీ నేర్చుకుని క్రొత్తగా స్టూడియో పెట్టాడు. ఉద్యోగం చెయ్యటం ఇష్టంలేక ఆ ప్రయత్నం చెయ్యలేదుగాని, చేస్తే గెజిటెడ్ ఆఫీసర్ కాదగ్గ లక్షణాలు కలవాడు. సరే. అసలు జరిగిన

విషయం ఇదీ. స్టూడియోకి నడుస్తూ వెళుతున్నాడు. రాత్రి బాగా వాన కురిసింది. రోడ్డు గుంటలుపడి నీళ్ళు నిలిచాయి అక్కడక్కడ. అలాంటి ఒక నీటి గుంటదగ్గరికి అతను రాగానే వెనుకనించి బుస్సున ఒక బస్సు వచ్చి రకీమని అతని దగ్గర ఆగింది. ఆ ఆగటంలో ఒక చక్రం నీటి గుంటలో చెర్లాడటం, ఆ పక్కనే ఉన్న శ్రీరామ్ దుస్తులన్నీ గులామ్ కొట్టినట్టు కావటం, బస్సులోనివాళ్ళూ, పక్కన నడుస్తున్నవాళ్ళూ ఇహిహి అనటం టకటక జరిగిపోయాయి. నీటిమరకలతో ఖరాబైన దుస్తుల్ని చూసుకుని, పరాకుగా నడిచినందుకు తనని తిట్టుకుంటూ, కోపంగా బస్సు డ్రైవర్ వైపు తలెత్తి చూడబోయిన శ్రీరామ్ అనుకోకుండా ఫ్రంట్ సీట్‌లో కూర్చున్న అమ్మాయివైపు చూశాడు.

ప్రమాదం జరిగిపోయింది.

ఆమె గభాలున ఒక్కనవ్వు నవ్వి, ఇంతలో తెలివి తెచ్చుకుని నోటికి రుమాలు అడ్డం పెట్టుకుని బుద్ధిమంతురాలిలా గిరుక్కున తల తిప్పింది. అంతే—

తీరని పరాభవాగ్నిలో మాడిపోయాడు శ్రీరామ్.

ఏం చేయాలో అతనికేం తోచలేదు. అయితే ఆ సమస్యని బస్సు డ్రైవర్ పరిష్కరించివేశాడు. శ్రీరామ్ నోరు మెదపటానికి ప్రయత్నిస్తుండగానే తుర్రున పరుగుతీసింది బస్సు. చేసేదేమీలేక ఒక రిక్షా పిలిచి స్టూడియో చేరుకున్నాడు శ్రీరామ్. స్టూడియోలో ఎప్పుడూ ఒకజత దుస్తులు అవసరం కోసం ఉంటూనే ఉంటాయికనుక ఆ సమస్య ఏమీ లేదు. కాని జరిగిన పరాభవం మాత్రం అతను త్వరగా మర్చిపోలేక పోయాడు.

అంతమందీ నవ్వటం ఒకఎత్తు.

ఆమె అలా రుమాలు చాటున ముసి ముసిగా నవ్వటం ఒకఎత్తు. మయ సభలో దుర్యోధనుడు భంగపడగా, ద్రౌపది నవ్విన నవ్వు అతని మనో

ఫలకంలో మెరిసింది. అతని ముఖం అవమానంతో ఎర్రబడ్డా ఆమె గడుసుగా నవ్వినప్పటి సౌందర్యాతిశయాన్ని ప్రశంసించకుండా ఉండలేక పోయాడు. స్టూడియోలోకి వెళ్ళినప్పటినించీ ఏదో పని ఉంటుందికనుక ఆ పనిలో లీనం కావటంతో జరిగిన సంగతి క్రమంగా మనసులో మరుగైంది ఆ మరుగైన తరుణంలోనే—

ఆ తరుణి అలా ప్రత్యక్షం కావటం జరిగింది.

ఇలా ఆ యువకుణ్ని తను కలుసుకోవలసి వస్తుందని కలలోకూడా ఆమె అనుకోక పోవటంతో అకస్మాత్తుగా కలిగిన అతని సందర్శనం ఆమెని ఇరుకులో పెట్టింది. ఒక్క క్షణం బిత్తర పోయినా కొంచెం చొరవగల స్వభావం కావటంవల్ల నిలదొక్కుకుని అతన్ని తను అప్పుడే మొదటిసారి చూసినట్టుగా ప్రవర్తించా లనుకుని తీర్మానించుకుంది. అతను వెంటనే తేరుకోకపోవటంతో తను వచ్చిన పని మళ్ళీ ఒకసారి జ్ఞాపకం చేసింది.

"కాబినెట్ సైజ్ ఫోటో కావాలండీ."

శ్రీరామ్ వెంటనే తెలివి తెచ్చుకుని, తొట్రుపాటుతో "అలాగే, కూర్చోండి." అన్నాడు.

ఆమె కూర్చుంది. అతను యాంత్రికంగా బల్లముందున్న కుర్చీలో కూర్చుని నోట్ బుక్ తీశాడు.

"ఎంతవుతుందండీ?"

"పన్నెండు రూపాయలు.` అన్నాడు అప్రయత్నంగా శ్రీరామ్.

"అడ్వాన్స్ ఏమైనా ఇవ్వాలా ?

"ఇస్తే ఇవ్వండి." అన్నాడు కొంచెం నమ్రతగా వ్యాపార సరళిలో.

ఆమె ఒక అయిదు రూపాయల నోటుతీసి అతనికిచ్చింది. అతను డ్రాయర్ తీసి అందులో ఆ నోటు నిర్లక్ష్యంగా పడేసి తరవాత కార్యక్రమాన్ని జ్ఞప్తికి తెచ్చుకుని రసీదు రాయటానికి ఉపక్రమించాడు.

"పేరేమండీ."

"మీనాక్షి."

కేవలం యాంత్రికంగా తటాలున అతను తలెత్తి ఆమె కళ్ళవైపుచూశాడు. ఆమే చూసింది. ఆ చూపులో ఏదో గర్వం, అహంభావం, పెంకెతనం స్పష్టంగా పసిగట్టాడు శ్రీరామ్.

అవే చూపులు! అవును. తను స్పష్టంగా గుర్తుపట్టాడు! అతని ముఖం ఎర్రబడింది. గుండె దడదడ కొట్టుకుంది.

"కాపీలు ఎప్పుడివ్వగలరు?"

సూటిగా, వచ్చిన పని గురించి ఆమె సంభాషణ కొనసాగించింది.

"రేపు ఈ వేళ కిస్తాను." అన్నాడు శ్రీరామ్. కాని లోపల "అసలు ఈ ఫోటో నేను తియ్యను అనాలని అతని ఉద్దేశం.

"రేపు ఆదివారం." అందామె వచ్చే నవ్వు అపుకుంటూ.

"ఓ అవును ఎల్లుండి," అన్నాడు ఆమె నవ్వుకి కోపగించుకుంటూ శ్రీరామ్.

"రేపు సాయంత్రం ఇవ్వలేరా ?" అందామె.

"రేపు ఆదివారం కదా!" అన్నాడు అతను. ఆమె అలా ఎందుకడిగిందో అర్థం కాక.

"అవుననుకోండి. వీలుకాదా?" అంది మీనాక్షి. ఆ ప్రశ్నలో ఏదో అతిశయం ఉందనిపించిం దతనికి.

"కాదు," అన్నాడు నిష్కర్షగా.

"పోనీ, ఎక్కువ చార్జీ తీసుకోండి."

శ్రీరామ్ ఆత్మగౌరవం దెబ్బతింది. అంత తక్కువగా, కేవలం తను డబ్బుకోసమే ఈ వృత్తిలోచేరి, డబ్బుకోసం ఏపనైనా చేసేవాడిలా ఆమె భావించినందుకు అతనికి ఒళ్ళు మండింది.

"సారీ, వీల్లేదు" అన్నాడు అధికారి తన క్రింది ఉద్యోగిని గద్దించే ధోరణిలో.

"సరే, ఆల్బమ్ యిస్తారా ?"

ఫొటోల ఆల్బమ్ ఆమె ముందుకి తోశాడు శ్రీరామ్. ఆమె ఫోటోలు ఒక దాని తరవాత ఒకటి శ్రద్ధగా చూడసాగింది.

శ్రీరామ్ రసీదు రాయటం పూర్తి చేశాడు.

"మీ అడ్రస్ చెబుతారా ?"

"ఎందుకు ? పోస్టులో పంపుతారా !"

"పంపమంటే పంపుతాను."

"పంపండి." అందామె కొంచెం తీవిగా.

"ఎల్లుండి పొద్దునవస్తే ప్రూఫ్ చూడవచ్చు." అన్నాడు అతను ఆమె చెప్పిన అడ్రస్ నోట్ చేసుకుంటూ.

"అదికూడా పోస్టులోనే పంపండి." అందామె టెక్కుగా.

శ్రీరామ్‌కి మొదటిసారిగా నవ్వువచ్చింది. నవ్వేశాడు. "అలాగే" అన్నాడు అతని నవ్వుచూసి ఆమె ముఖం చిట్లించుకుంది. తను అనుకున్నవిధంగా అతను నమ్రతగా మాట్లాడకపోవటానికి కారణం పొద్దున జరిగిన సంఘటన వల్ల అతనికి కోపం రావటమే ననుకుంది. అతను అలాఉడుక్కుంటుంటే ఆమెకి సరదాగానేఉంది. కాని చివర అతను నవ్వేయటంవల్ల అతనిదే పైచేయిగా ఉందని అనుమానంతో ఆమెకి చిరుకోపం కలిగింది.

"నేను వచ్చి చాలా టైమయింది." అంది ఫిర్యాదు చేస్తున్న ధోరణిలో.

"రండి." అని శ్రీరామ్ ఆమెకి రసీదిచ్చి కెమేరా సరిచేసుకోసాగాడు.

అప్పుడప్పుడే సాయంసమయ మవుతోంది.

శ్రీరామ్ లైట్లు సరిచూసుకున్నాడు.

"ఏదైనా సెలెక్టు చేశారా ?" అని ఆమెవైపు చూశాడు.

ఆమె తెరచిన ఆల్బమ్ అతని చేతికిచ్చింది.

ఒకసారి అటువైపు యధాలాపంగాచూసి "ఫుల్ సైజ్ ?" అన్నాడతను.

ఆమె తల ఊపింది.

"అలా నిలబడండి."

మీనాక్షి కెమేరాకి ఎదురుగా నిలబడింది. శ్రీరామ్ లైట్లువేసి చూశాడు. మళ్ళీ ఆర్పివేశాడు. వాటి స్థానాలు మార్చాడు. కెమెరా జరిపాడు.

అతని కెందుకో ఫలితం తృప్తిగాలేదు. ఆమెకి విసుగుపుట్టసాగింది.

అతను దగ్గిరగావచ్చి లైట్లువేసి ఆమె కెదురుగా నిలబడి పరకాయించి చూశాడు. ఆ విధంగా నిలబడి ఆమె వదనాన్ని బహు భంగిమల్లో పరికించాడు.

ఆమెకి ఏదో అనుమానంవేసింది.

"ఏమండీ, అసలు ఫొటో తీస్తారా ?" కటువుగా అనేసింది,

అతను తెల్లబోయాడు.

"అందుకేకదా, ఈ ప్రయత్నం !" అన్నాడు ముఖంమీద జనించిన స్వేద బిందువుల్ని తుడుచుకుంటూ.

ఆమె ఉస్సురంది!

"అయిపోయింది. ఒక్కక్షణం,"

మరొక భంగిమలో, మరొక వెలుగు నీడల పద్ధతిలో ప్రయత్నించాడు.

"కొంచెం తలపైకెత్తండి, ఇటుచూడండి. ఉహు — అటు — కొంచెం వాలుగా — ప్చ — ఊఁ — ఇలా....నావైపు చూడండి...."

"షటప్" అంది మీనాక్షి రోషంతో వదనం ఎరుపెక్కి అధరాలు చలించగా. శ్రీరామ్ ముఖంలో నెత్తురు చుక్కలేదు. నోరు తెరుచుకుని

ఆమెవైపు చూశాడు. గడుసుతనంతో దురుసుతనం కలిసి ఆమె సహజ లావణ్యాన్ని అతిశయింప చేసింది.

"స్కౌండ్రల్." అందామె దురుసుగా.

శ్రీరామ్ ముఖం నల్లబడినా, ఆకర్షణీయమైన ఆమె స్వరూపంచూసి కోపగించుకోలేక పోయాడు. తనవైపు చూడకుంటే ఆమె అపార్థం చేసుకుందనుకున్నాడు.

"క్షమించండి, మీ కెందుకో కోపం వచ్చింది. ఫొటో బాగారావాలని ప్రయత్నం చేశాను. అంతే. ప్లీజ్, ఒక్కసారి అలా నిలబడండి. ఇహ మిమ్మల్ని బాధించను." ప్రాధేయపడ్డట్టుగా అన్నాడు శ్రీరామ్,

క్రమక్రమంగా ఆమె కోపం చల్లారింది. మారుమాట్లాడకుండా ఆమె కెమెరా ఎదురుగా మళ్ళీ నిలబడింది. వెంటనే కెమెరా ఏర్పాట్లు పూర్తి చేసుకుని 'క్లిక్' అనిపించాడు శ్రీరామ్.

"థాంక్ గాడ్" అందామె విసురుగా.

శ్రీరామ్ ఏమీ అనలేదు.

ఆమె ఏమనుకుందోగాని, కొంచెం రాజీ ధోరణికి వచ్చినట్టుగా "అయితే పోస్టులో పంపుతారా?" అని అతనివైపు చూసింది.

అతనామెవైపు చూడకుండానే, "మీ రొకసారి ప్రూఫ్ చూస్తే మంచిది. మీ ఇష్టం," అన్నాడు.

"సరే ఎల్లుండి వస్తాన్లెండి," అనేసి ఆమె వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళినవైపేచూసి శ్రీరామ్ ఒక నిట్టూర్పు విడిచి బాధగా నవ్వుకున్నాడు.

మీనాక్షి అనుకున్నరోజు రాలేదు. మర్నాడుకూడా రాలేదు. శ్రీరామ్ తటపటాయించి ఫొటో కాపీలు తయారుచేశాడు. పోస్టులో పంపాలని ప్యాకింగ్ కూడాచేసి చివరికి పంపకుండా ఆపేశాడు.

వస్తానన్న రోజుకి నాలుగురోజుల తరవాత మీనాక్షి ఒక సాయంకాలం విసురుగా స్టూడియోలోకి వచ్చింది.

''ఏమండీ పోస్టులో పంపుతారన్న ఫొటోలకోసం ఎదురుచూడలేక కళ్ళు కాయలు కాచాయి. ఫొటోలు తయారు కాలేదా, లేకపోతే—''

ఆమె ఆగింది.

ఆమె ధోరణికి నవ్వుకుంటూ ఆమె పూర్తిచేయబోయే వాక్యంకోసం ఆగాడు శ్రీరామ్.

ఆమె వాక్యం పూర్తిచెయ్యలేదు.

''మీరు ప్రూఫ్ కోసం రాలేదుగా'' అన్నాడతను. మాట్లాడవలసింది తనేనని తెలుసుకుని.

''రాకపోతే అలా ఆపేస్తారా ? బాగుంది. అయితే ఇంకా కాపీలు ప్రింటు చెయ్యనేలేదా ?''

అతను సమాధానం చెప్పకుండా ప్యాకెట్ విప్పి ఫొటోలు ఆమె కందించాడు.

ఆమె ఆతృతగా వాటిని అందుకుని చూసి గభాలున బల్లమీద పొదిలేసి తీక్షణంగా అతనివైపు చూసింది.

ఆ చూపు కోసమే అతను ఎదురు చూశాడు.

ఆమె వదనం రోషకషాయితమైంది.

''ఇదేం ఫొటోగ్రఫీ అండీ ?''

''క్షమించాలి. అది నా తప్పుకాదు.''

''కెమెరాదా ? లైట్లదా ? లేక....

''ఎవరి తప్పూకాదు. ఎవరు తీసినా ఆ ఫొటో అలాగే వస్తుంది.''

''ఆఁ ?''

"అవును."

మీనాక్షి ముఖం వివర్ణమైంది. అతనివైపు అనుమానంగా చూసి అంది.

"మీ చేతగాని తనాన్ని అలా దాచుకుంటున్నా రన్నమాట."

"చేతగాని తనాన్ని దాచుకోవటం నా కలవాటు లేదండీ. నా చేతగాని తనంతో ఇతరుల కే అన్యాయం చెయ్యటం నాకంతకంటే ఇష్టం లేదు. ఉన్న సంగతే చెప్పాను."

మీనాక్షి ముఖం వెలవెల బోయింది. ఫొటోలో కళ్ళు ఉండవులసిన చోటులో ఇంచుమించు చీకటి ముద్దలు ఉండటం చూసి భరించలేక ఉక్రోషంతో, అవమానంతో, కోపంతో అతనివైపుచూసి చలించే అధరాలని పళ్ళతో అదిమిపట్టింది. ఇంతలో ఆమెకి ఫొటోతీసిన నాటి సంఘటన జ్ఞప్తికి వచ్చింది.

"మీకు నామీద కోపంవుంటే ఉండొచ్చు. కాని నన్నుచూసి ఈ ఫొటో చూసిన వాళ్ళ మీ కళానైపుణ్యాన్ని తెగ మెచ్చుకుంటారని మర్చిపోకండి. నాపేరు మీనాక్షి. నాకళ్ళుచూసే నాకాపేరు పెట్టారు తెలుసామీకు!"

తిరస్కారంగా ఈ మాటలంటూ ఆమె అతనివైపు చూసింది. ఆ చూపులో గర్వం అతన్ని రెచ్చకొట్టింది.

"మీ కళ్ళు బావుండలేదని నే నెప్పుడూ అనలేదు. అనను. నేను ఫొటోగ్రాఫర్ని. ఉన్నది ఉన్నట్లు ఫొటోలో చూపించటమే నాకుతెలుసు. అది బాగుండకపోతే నేను బాధ్యుణ్ని కాను."

"అయితే ఇది నా లోపమే నంటారు."

"నా లోపం కాదు."

"హుఁ. ఈ ఫొటోలు నా కక్కర్లేదు."

"పోనివ్వండి."

"మీ కివ్వాల్సిన దాంట్లో దమ్మిడీ కూడా ఇవ్వను.

నా పేరు మీనాక్షి. నాకళ్ళు చూసే నా కాపేరు పెట్టారు. తెలుసా మీకు?"
తిరస్కారంగా ఈ మాట లంటూ ఆమె తనవైపు చూసింది. ఆ చూపులో గర్వం అతన్ని రెచ్చగొట్టింది.

"మీకళ్ళు బావుండలేదని నే నెప్పుడూ అనలేదు. అనను. నేను ఫొటోగ్రాఫర్ని. ఉన్నది ఉన్నట్లు ఫొటోలో చూపించటం నాకు తెలుసు. అది బాగుండకపోతే నేను బాధ్యుణ్ని కాను."

"అయితే ఇది నా లోపమే నంటారు.

"నా లోపంకాదు."

"హుఁ. ఈ ఫొటోలు నాకక్కర్లేదు."

"పోనివ్వండి."

"మీ కివ్వాల్సిన దాంట్లో దమ్మిడీకూడా ఇవ్వను."

"ఫరవాలేదు."

మీనాక్షి ఉక్రోషం పట్టలేకపోయింది.

"అవును, చేసినపనికి ఏముఖం పెట్టుకుని అడుగుతారు? ఫొటోతీసే మిషతో మీరు తలపెట్టిన దుశ్చర్య ఎవరికైనా చెబితే మీ పరువు నట్టేట్లో కలుస్తుంది. పెద్దమనుషు లనుకున్నాను. ఛీ!" శ్రీరామ్ సహనం నశించి పోయింది.

"మీనాక్షిగారూ, మీరు అపార్థం చేసుకున్నారు. క్షమించండి, మీరు బాధ పడతారని ఇంతవరకూ చెప్పలేదు. మిమ్మల్ని అంతసేపు విసిగించిన కారణం ఈ చీకటి ముద్దలు రాకుండా చేయటానికే. ఎంతప్రయత్నించినా ఎన్ని భంగిమలు మార్చినా అది నావల్ల కాలేదు. మీ దురదృష్టానికి ఇతర్లని నిందించి ప్రయోజనం లేదు. నమ్మండి, నమ్మకపోండి. ఇదీ వాస్తవం."

నిలువునా కుర్చీలో కూలబడిపోయింది మీనాక్షి. ఆమె ముఖం ఒక్క-క్షణంలో రోజులు తరబడి లంఖణాలు చేసినట్టుగా పాలిపోయింది. ఏదో భీతి ఆమె కళ్ళలో తాండవమాడింది. ఆమెకి తను పూర్వం తీయించుకున్న ఫొటోలు జ్ఞప్తికి వచ్చాయి. పూర్వపు ఫొటోలన్నీ తను నాలుగైదేళ్ళ కిందట తీయించుకున్నవి, ఫొటోగ్రాఫర్ మాటలు వింటుంటే పాతఫొటోల్లోకూడా ఈ లోపం కొంత ఉన్నట్టే కనిపించింది ఆమెకి. కాని అప్పుడంతగా తను ఈ లోపం పట్టించుకోలేదు. తన ఆశా సౌధాలన్నీ ఒక్క-సారిగా కూలిపోయాయి. బస్సుదగ్గిర సంఘటన పురస్క-రించుకుని అతను కోపంతో తనని ఆరోజున ఫొటోతీసే మిషతో అవమానించాడని అభిప్రాయ పడ్డది. తన లోపాన్ని సవరించటానికి అతను పడ్డ శ్రమ గుర్తుకు రాగానే ఆమెకి ముచ్చెమటలు పోశాయి. తన కళ్ళు అంత సమస్య కలిగించాయా ? ఇన్నాళ్ళూ తనకళ్ళనిచూసి తను మురిసిపోయింది. అందరూ చేపల్లాంటి కళ్ళని తనని పొగుడుతుంటే ఎంతో గర్వపడేది. ఆ అందానికి తనలో ఏదో అతిశయం కలిగేది. కాని ఇప్పుడు ఆకాశంనించి నేలమీదికి కూలదోశాడు ఈ ఫొటోగ్రాఫర్. అతన్నని ఏం ప్రయోజనం ? తనకి లేని అందం తను ఫొటోలో ఆశించటంవల్ల ఫలితం శూన్యం.

మీనాక్షి కుర్చీలోంచి లేచి నిలబడ్డది. ఎదురుగా నిలువుటద్దం ఉంది. అద్దంలో తన ముఖం చూచుకుంది. విశాలంగా వ్యాపించి ముందుకి వాలిన నుదురు కిందుగా, యవ్వనంతో ఉబికిన బుగ్గలమీదుగా కలువ మొగ్గల్లా విస్తరించా యనుకున్న తనకళ్ళు తనకే అసహ్యం కలిగిస్తున్నాయి. లోయల్లాంటి కళ్ళని చీకట్లు ఆవరించాయి. మీనాక్షి కళ్ళకి చీకట్లు కమ్మినట్టయి ముందుకుతూలి, ఏలాగో తట్టుకుని మరేమీ మాట్లాడకుండా నెమ్మదిగా స్టుడియో బయటికి వెళ్ళిపోయింది.

ఒక్క- నిమిషంలో ఆమెలో అంతటిమార్పు గమనించిన శ్రీరామ్‌కి జాలి వేసింది. తను చాలా క్రూరంగా ప్రవర్తించాడు. తనలో ఏదో అహం

భావం ఇలా ప్రేరేపించింది. అశాంతితో శ్రీరామ్ లేచి నిలబడ్డాడు. ఆమెని పిలిచి అంతా అబద్ధమని చెప్పా లనిపించింది. గుమ్మందాకా వెళ్ళాడు. అప్పటికే ఆమె చాలా దూరంగా వెళ్ళిపోయింది. చిత్రం! ఆమె నడక చూస్తుంటే తనకి ఏదో పెద్ద మార్పు కనిపిస్తోంది. ఆహుందాతనం లేదు. ఆ సొగసు లేదు. ఏదో బరువుతో బలహీనంగా అలసటగా అడుగు వేస్తున్నట్టుగా ఉంది. ఎంతలో ఎంతమార్పు! శ్రీరామ్‌కి హృదయంలో దేవినట్టయింది. ఆమె ఫొటో తీసి చూశాడు. తను ఫొటోగ్రాఫర్. ఉన్నది ఉన్నట్టు చిత్రించటం తన విద్యుక్త ధర్మంకావచ్చు. అందరూ తనని అలాగే అంటారు. కాని ఏదో లోపం ఉంది తన కళ్ళలో. సాధ్యమైనంతవరకు తను సౌందర్యాన్ని సృష్టించాలనే ప్రయత్నిస్తాడు. కాని అదంతా కెమెరాతోనే చేసేవాడు.

ఆమె తనని కించపరచకపోతే బహుశా ఈసారికూడా ఏదో భంగిమలో సౌందర్యాన్ని సృజించగలిగేవాడే. కాని ఇప్పుడైనా మించిపోయిందిలేదు. తనకి ఫొటోగ్రఫీలో అసాధ్యం లేదు.

కృతనిశ్చయంతో శ్రీరామ్ ఆమె ఫొటో నెగటివ్ తీసుకున్నాడు. జాగ్రత్తగా పరిశీలించాడు. తన కళానైపుణ్యాన్ని వినియోగించి, టచ్‌చేసి, చక్కటి ప్రింటులు తీశాడు. చాలా ముచ్చటగా ఉన్నాయి. మీనాక్షి మళ్ళీ వస్తుందనే ఆశ ఏమూలో ఉన్నా, రోజులు గడచినకొద్దీ నిస్పృహచెందసాగాడు. తనే స్వయంగా ఆమె ఇంటికి వెళ్ళి ఇచ్చిరావా లనుకున్నాడు గాని, చొరవచెయ్యలేకపోయాడు.

స్టుడియోనుంచి ఆరోజు బయటికి వచ్చినప్పటినుంచీ మీనాక్షి మనసు మనసులో లేదు. కంటి కెదురైనవాళ్ళ కళ్ళవైపు పరీక్షగా చూడసాగింది. ఎవరైనా తనవైపు పరకాయించి చూస్తే తన కళ్ళలోని లోపాన్ని పరిశీలిస్తున్నారేమో నని ముఖం చిన్నబుచ్చుకునేది. రానురాను ఆ దిగులు

ఆమెకి ఎక్కువకాసాగింది. ఆ సమయంలో ఆమెకి ఒక ఊహతట్టింది. బజారుకివెళ్ళి చలవకళ్ళజోడు కొన్నది. అది ధరించినప్పటినించీ ఆమెకి ఒకవిధమైన సంతృప్తి కలిగింది. కాని అందర్నీ ఒక్క చూపుతో అల రించి మురిపించి బందీచేయగలననుకున్న తన నల్లటి కళ్ళని ఆకళ్ళజోడు చాటున దాచుకోవలసి రావటం ఆమెకి దిగులునీ, తక్కువతనాన్నీ కలి గించింది. పూర్వపు గడుసుదనమూ, అతిశయమూ అంతరించాయి.

ఒకనాటి ఉదయం ఆమె బస్సులో కాలేజికి వెడుతుండగా అకస్మాత్తుగా చూశాడు శ్రీరామ్. ఆలోచించకుండానే తటాలున బస్సెక్కాడు. సర్దు కుని కూచునేలోగా అతనికి షాక్ తగిలినంత పనయింది. ఖాళీసీటులో కూర్చోబోతూ ఆమెవైపు చూసేసరికి అతను నిర్ఘాంతపోయాడు, ఆమె చలవ కళ్ళజోడు పెట్టుకుంది. గుండెల్లో ఎవరో బాకుతో పొడిచినట్టయిం దతనికి. తనని ఆమె చూసిందా ? ఎప్పటినించి ఈమె కళ్ళజోడు అల వాటు చేసుకుంది ? సందేహమెందుకు ? అది ఫాషన్‌కోసం ధరించింది కాదు. ఆమె వదనంలోకూడా చాల మార్పు వచ్చింది. కొంత కృశిం చింది. తను ఆమెకి తీరని అపకారం చేశాడు. తను బస్సులో ఎక్కి నప్పుడు ఆమె కళ్ళజోడు పెట్టుకోలేదు. బహుశా తనని చూడగానే పెట్టు కుని ఉంటుంది. ఆమె అసలు తనవైపు చూడటంలేదు. బస్సు కటకటా ల్లోంచి రోడ్డుమీదికి చూస్తోంది.

బస్సులో సగంమంది స్త్రీ లున్నారు. కాలేజీ విద్యార్థినులు ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ ముసిముసినవ్వులు నవ్వుకుంటున్నారు — మీనాక్షి మాత్రం ఏమీ జోక్యం కల్పించుకోటంలేదు. ఇదంతా శ్రీరామ్ చూస్తూనే ఉన్నాడు. అతనికి బస్‌లో కూర్చోబుద్ధి పుట్టలేదు. తరవాతి స్టాప్‌లో దిగి సరాసరి స్టుడియోకి వెళ్ళాడు. ఆమె ఫొటోలు తీసుకుని అడ్రసు ప్రకారం మీనాక్షి ఇంటికి వెళ్ళాడు. వరండాలో ఒక వయసుమళ్ళిన వ్యక్తి సోఫాలో కూర్చొని పేపరు చదువుకుంటున్నాడు.

...Mirzaguda. Secunderabad...


"నమస్కారమండీ."

"నమస్కారం, కూర్చోండి."

అనవసర ప్రసంగం ఏమీ చేయకుండా శ్రీరామ్ మీనాక్షి ఫొటోల్ని ఆయన కిచ్చాడు.

"ఓ, అమ్మాయి ఫొటోలా ?" అని ఆయన అందుకుని పరీక్షగా చూసి ముచ్చటపడ్డాడు.

"బాగున్నాయా !" అన్నాడు శ్రీరామ్.

"చాలా బాగున్నాయండీ, నైస్‌గా ఉన్నాయి. లైట్ అంట్ షేడ్ ఎఫెక్ట్సు చాలా చక్కగా తెచ్చారు ఎంతివ్వాలండీ!"

"ఏమీ ఇవ్వక్కర్లేదండీ." అన్నాడు శ్రీరామ్ నిర్లిప్తంగా.

"ఓ, ఇచ్చేసిందన్నమాట. ఫొటో తీయించుకోమని నేను పోరుపెడుతూంటే, నాతో మాటమాత్రం చెప్పలేదు చూడండి, పైగా, అకస్మాత్తుగా బుగ్గయింది. ఎంతమంచి సంబంధమండీ ! ఐ. ఏ. యస్. ప్యాసయాడు. ట్రయినింగ్‌లో ఉన్నాడు. కళ్ళకద్దుకొని చేసుకుంటాడుగదా ! దూరంలో ఉండటంవల్లా. సెలవు దొరక్క పంపమంటే ఈవిడగారికి పనికిరాలేదు. మొన్నటిదాకా ఏమీ ఎదురుచెప్పకపోతే మౌనం అంగీకారమే నను కున్నాను. కాని మళ్ళీ చదువుకొని ఉద్యోగం చేస్తాననీ, పెళ్ళిచేసుకోననీ మొదలుపెట్టింది. ప్చ్. ఈ కాలపు పిల్లలకి ఏ క్షణాన ఏబుద్ధి పుడుతుందో తెలియదు. గట్టిగా ఏదన్నా అంటే బెడిసికొడుతుందేమోనని భయం. అన్నట్టు మీ పేరేమండీ ?"

"శ్రీరామ్ అండి."

"ఓ, శ్రీరామ్ స్టుడియో ! మీరేనా శ్రీరామ్ ఆనర్స్ ఫొటోగ్రాఫర్ ! కదూ ? అందరూ మీపేరు గొప్పగా చెబుతారు. ఈ ఫొటోలుచూస్తుంటే అదంతా నిజమేనని తెలిసిపోతుంది. ఇంకేం. అన్నటు ఆమధ్య మరేదో

స్టుడియోలో ఫొటో తీయించుకుందట, చెడగొట్టాటండీ, ఏమీబాగాలేదుట అందుకని తీసుకోలేదని చెప్పింది. ఈ ఫొటో లెప్పుడు తీశారండీ.'

"ఈ మధ్యేనండి." అన్నాడు తప్పించుకునే ధోరణిలో. ఆయనమాటలు వింటుంటే తనేదో ద్రోహం చేసినట్టు అతనికి బాధకలిగింది. మీనాక్షిలో కలిగిన మార్పుకి తనే కారణం. పాపం. ఆయన కా సంగతి తెలియదు. మరికొంత సేపుంటే దాచుకోలేక తనే ఆ విషయం బయటపెట్టేస్తాడేమో ననే భయంతో శ్రీరామ్ వెంటనే ఆయనదగ్గర సెలవుపుచ్చుకుని స్టుడియోకి వచ్చేశాడు.

ఫొటోలుచూసి మీనాక్షి ఊరుకోదనీ, బహుశా, స్టుడియోకి తప్పక వస్తుందనీ శ్రీరామ్ భావించాడు. అతను అనుకున్నట్లుగానే ఆ మర్నాటి సాయంకాలం ఆమె రానేవచ్చింది.

"మీ కెంత ఇవ్వాలండీ?" అని ఇవ్వాలిసిందేదో ఠాంగున బల్లమీద కొట్టి "ఇందుకేగా మీరు కష్టపడి మసిపూసి మారేడుకాయచేసి ఇల్లు వెతుక్కుంటూ వచ్చి ఫొటోలు చేరేశారు. అని కోపంగా, విసురుగా, గడుసుగా అనేసి వెళ్ళిపోతుందని మనసులో ఏవేవో ఊహించుకున్నాడు శ్రీరామ్. అలా ఆమె బిరుసుగా దురుసుగా ఏదో అంటూంటే ఆ భంగిమలో వ్యక్తమయే మిడిసిపాటులోని ఏదో ఆకర్షణ తనని పరాజితుణ్ని చేస్తున్నట్టుగా అనుభూతి పొందాడు. "క్షమించండి, ఫొటోలు మీ దగ్గిర్నించి తీసుకోవాలనే ఆలోచనే పోలేదు నాకు, మీకు శ్రమకలిగించాను."

శ్రీరామ్ ఊహాప్రపంచంలోంచి ఊడిపడ్డాడు. అలా ఆమె నమ్రతగా మాట్లాడుతుంటే ఏదో ఆశ్చర్యమేమీ లేదనుకున్నాడు. కాని అతని హృదయంలో ఏదో అసంతృప్తి గూడు కట్టుకొంది. ఆమెవైపు తేరిపార చూశాడు. ఆమె ముఖం పక్కకి తిప్పుకుంది.

"పరవాలేదండీ" అన్నాడు మర్యాదగా.

"మీకు కొంత డబ్బివ్వాలి కదూ" అని ఆమె అతనికి రావలసిన మొత్తం ఇచ్చింది.

"థాంక్స్" అన్నాడు.

" ఫొటోలు టచ్ చేశారు. థాంక్స్" అంది. అలా అంటూండగా ఆమె ముఖంలో ఎన్నడూలేని దైన్యం ప్రస్ఫుటమైంది. అప్రయత్నంగా ఆమె ఎదురుగా ఉన్న అద్దంలో చూసుకుంది. కాని వెంటనే కళ్ళు పక్కకి తిప్పేసుకుంది, ఆ దైన్యాన్ని భరించలేక పోయాడు శ్రీరామ్. ఏదో బలీయమైన ఆకర్షణ ఆమెలో ఉందను కున్నాడు పూర్వం. కాని ఒక సర్వసాధారణమైన అందమే ఆమెలో అతనికి కనిపిస్తోంది.

తలెత్తి ఆమె కళ్ళలోకి చూశాడు.

"కళ్ళజోడు మీకు అందం ఇవ్వదండీ. క్షమించాలి' అన్నాడు.

ఆమె సమాధానం చెప్పలేదు.

ఒక క్షణం ఆగి అతను మళ్ళీ అన్నాడు.

"మీరు క్షమిస్తానంటే ఒకవిషయం చెబుతాను."

"ఏమిటి ?" అందామె కొంచెం కుతూహలంగా.

"ముందా కళ్ళజోడు తీసెయ్యండి."

ఆమె మంత్ర ముగ్ధురాలిలా కళ్ళజోడు తీసివేసింది.

"మీకళ్ళు చాలా అందంగా ఉంటాయి" అన్నాడు శ్రీరామ్ భావోద్వేగంతో.

ఆమె ముఖం దించుకుంది.

"నిజం కెమేరా పట్టటం చేతయిన వాడు అలా అంటే మీరు తప్పక నమ్మాలి నిజంగా మీకు అన్యాయం చేశాను."

ఆమె అర్థం కానట్టుగా అతని వైపు చూసింది.

"ఆరోజు అలా ఎందుకన్నా నంటాతా ? కేవలం మీ మీద కోపంవల్లే బస్సుదగ్గిర జరిగింది చూసి మీరు నవ్వితే నాకు కోపంవచ్చింది. తరువాత

ఫొటో తీస్తున్నప్పుడు మీరు తొందరపడి మాట అంటే నాకు చిరాకు వేసింది. ప్రతీకారం చెయ్యాలనుకున్నాను. కాని తరువాత నా పొరపాటు తెలుసుకున్నాను.

శ్రీరామ్ గుక్క తిప్పుకోకుండా నిస్సంకోచంగా ఈ మాటలు అనేసి ఆమె ముఖంలోకి చూశాడు.

ఆమె కళ్ళలో ఏదో వెలుగు గోచరించించింది. ఆ వెంటనే అపనమ్మకం ఆమె నేత్రాల్లో స్పష్టంగా కనిపించింది.

"నిజమా ?" అందామె.

"నిజం నమ్మండి".

మీనాక్షి ఆలోచించింది. అతను చెప్పేది నిజమేకావచ్చనే ఊహ ఒక్క క్షణం ఆమెని ఆనందాబ్దిలో ఓలలాడించింది. పెదవులమీద చిరునవ్వు ఒక త్రుటికాలం వెలిసింది. చేతిలోని కళ్ళజోడు అప్రయత్నంగా బల్ల మీద వదిలేసింది. అద్దంలో చూసుకుంది. అవును, కళ్ళు నిజంగా అందమైనవే ! ఆమెలో ఏదోఉత్సాహం వెల్లివిరిసింది. అతనేదో అన్నంత మాత్రాన ఇన్నాళ్ళూ తనెందుకు గుడ్డిదైపోయింది ! "ఫొటోగ్రాఫర్ చెయ్యకూడనిపని చేశారు" అందామె అతనివైపు కోపంగా చూసి.

కోపంతో ఎర్రబడిన ఆమె వదనం చూశాడు శ్రీరామ్. ఆమె వదన బింబంలో అదృశ్యమైన సౌందర్యరేఖలేవో క్రమమంగా తిరిగి వస్తున్న ఛాయలు అస్పష్టంగా గోచరించాయి. కోపంలో ఆమె ఆకర్షణీయంగా ఉన్నమాట వాస్తవం. కాని కవ్వించే గడుసుదనపు ఆకర్షణలేదు. కోపంతో అన్నా ఆ మాటల్లో దురుసుదనంలేదు. శ్రీరామ్ కేదో అసంతృప్తిగా ఉంది. జవాబు చెప్పకుండా అలాగే ఆమెవైపు చూడసాగాడు.

"డబ్బు సరిపోయిందా ?" అన్నదామె హఠాత్తుగా.

చూడకుండానే తలూపాడు శ్రీరామ్.

"నమస్తే"

అనేసి ఆమె కళ్ళజోడు తీసుకోకుండానే స్టూడియో గుమ్మం దాటింది.

"మీనాక్షిగారూ"

ఆమె వెనక్కి తిరిగింది.

"కళ్ళజోడు మర్చిపోయారు,"

బల్లమీద కళ్ళజోడు తీసి ఆమె కందించాడు. అలా అందిస్తూఆమె కళ్ళ లోకి చూసి అదిరిపడ్డాడు, ఆమె కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. తను చూసీ చూడగానే ఆమె గిరుక్కున తిరిగి గబగబ వెళ్ళిపోయింది. ఎంత ఆలోచించినా ఆమె అలా కన్నీళ్ళ పెట్టుకోటం ఎందుకో అతని కర్థం కాలేదు. ఆ స్థితిలో ఆమెని అతనెప్పుడూ ఊహించుకోలేదు. అశాంతితో స్టూడియో బయటికి వచ్చాడు.

మీనాక్షి దూరంగా పోతూంది.

కాలికేదో తగిలి క్రింద చూశాడు శ్రీరామ్'

కళ్ళజోడు !

ఆమెకీ తీవ్రమైన కోపం వచ్చిందని గ్రహించా డతను. కళ్ళజోడు ముఖాన విసిరికొట్టి వెళ్ళిపోయే తత్వం మీనాక్షిది. కాని అంత కోపం లోనూ ఆమె అలాంటి పనేమీ చెయ్యకుండా తను చూడకుండా కళ్ళ జోడు బయట పారేసి వెళ్ళిపోయింది. వంగి ఆ కళ్ళజోడు తీసి భద్ర పరుస్తూ ఆవేదనతో అసంతృప్తితో మీనాక్షివైపు చూసి నిట్టూర్పు విడిచాడు శ్రీరామ్.

(1964)

—o—